మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





- కెసిఆర్ నాయకత్వంలో పాలమూరును సస్యశ్యామలం ..
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి మెడికల్ కళాశాల మహబూబ్‌నగర్‌కే
- దేశంలో రైతులను ఆదుకుంటున్నది ఒక్క కెసిఆర్ సర్కారే..
- ప్రజా ప్రతినిధులమంతా ఏకమై ఉమ్మడి పాలమూరును కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం..
- 9 విడతలుగా రైతుబంధు ద్వారా రైతులకు రూ. 50 వేలకోట్లు ఇచ్చాం
- డిసెంబర్ 4న సీఎం కెసిఆర్ సభను విజయవంతం చేద్దాం
- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్

# వలసలను... నివారించాం..!



**మహబూబ్‌నగర్,నవంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాకపూర్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వలసలు,నిరక్షరాస్యత, పేదరికంతో అవస్థలు పడుతుండేదని, అలాంటిది రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సస్యశ్యామలమై వలసలను నివారించుకోగలిగామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డిసెంబర్ 4న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం ఆయన మహబూబ్‌నగ్‌లోని తనక్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొట్టమొదటి మెడికల్ కళాశాల మహబూబ్‌నగర్‌కే వచ్చిందని,ఇప్పుడు అన్ని జిల్లాలలో కూడా మెడికల్ కళాశాలలు వచ్చాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తున్నదని, గురుకులాలు, మెడికల్ కళాశాలల ఏర్పాటు, ఎండాకాలంలో కూడా సాగునీరు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అందించే ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం చేసిందని అన్నారు. దేశంలో రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడమే కాకుండా సాగునీటి రంగానికి, పరిశ్రమలకు నాణ్యమైన కరెంటును ఇస్తున్న రాష్ట్రం ఏది లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా రైతుబంధు, రైతుభీమా అందజేస్తున్నామని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నో అవార్డులలో తెలంగాణ రాష్ట్రం ముందుందని, అన్ని ప్యారామీటర్లలో తెలంగాణ రాష్ట్రం ముందున్నదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఇప్పుడిప్పుడే భరోసా కలుగుతున్నదని మంత్రి తెఇపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరు కలిసికట్టుగా ఉమ్మడి జిల్లాను కాపాడుకుంటామని మరింత అభివృద్ధి చేస్తామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం నీటి పంపకాల వివాదాన్ని పరిష్కరించి కేటాయింపులనివ్వాలని ఆయన అన్నారు.రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ప్రజలకు పాలనను చేరువలోకి తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలలో సమీకృత కార్యాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టిందని, ఆ కార్యాలయ భవన సముదాయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పూర్తయినందున డిసెంబర్ 4న



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎంపిలు,మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు

రాష్ట్ర ముఖ్యమంత్రి దాన్ని ప్రారంభించేందుకు వస్తున్నారని తెలిపారు. వేగంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఫలితాలు వారికి నేరుగా అందేలా మధ్య దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా అందించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. మన రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో నిర్మించిన సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఇతర రాష్ట్రాలలోని సచివాలయాలకు సమానంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యాలయాల నిర్మాణం వల్ల అధికార యంత్రాంగం ప్రజలకు మరింత చేరువలో ఉంటుందదని, కేవలం గంటలోపే పరిపాలన కార్యాలయం చేరుకుని సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉమ్మడి జిల్లాలో వరిపంట విస్తారంగా పండుతున్నదని, రైతులు ఎప్పుడు వరి పంటనే వేసుకోకుండా ఇతర పంటలు వేసుకోవాలని అవకాశం ఉన్నత మేరకు వరిని తగ్గించాలని మంత్రి కోరారు. వరికంటే ఏ పంట వేసినా ఎక్కువ లాభాలు వస్తాయని, అందువల్ల వరిసాగు చేయకుండా పప్పు దినుసులు, వాణిజ్య పంటలను సాగు చేయాలని కోరారు. రైతుబంధు పథకం కింద ఇప్పటి వరకు 9 విడతలలో 50 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో వేరుశనగకు మద్దతుధర కంటే ఎక్కువరేటు పెట్టి బహిరంగ మార్కెట్లో కొంటున్నారని, అందువల్ల వేరుశనగ సాగుపై దృష్టి సారించాలని, దేశంలో తెలంగాణలో పండించిన వేరుశనగకు ఎక్కువ డిమాండ్ ఉందని, ప్రపంచ వ్యాప్తంగా మన వేరుశనగను బాగా ఇష్టపడతారని, ఇందులో ఆఫ్లాటాక్సిన్ లేనందున దీనికి ఎక్కువ గిరాకీ ఉన్నట్లు మంత్రి తెలిపారు. పొద్దుతిరుగుడు, నూనెగింజలు,పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీటి పంపకం చేయకుండా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఆటంకాలు కలిగిస్తున్నదని, అందువల్ల నీటి పంపకాలు చేసిసమస్య పరిష్కరించే విధంగా చూడాలని ఆయన తెలిపారు. జిల్లా సాగునీటి కోసం తహతహలాడిందని ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి, ఎత్తిపోతల పథకం పూర్తయితే జిల్లా మొత్తం సస్యశ్యామలం అవుతుందని ఆయన అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు, మహబూబ్‌నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మజీమంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే డా. అబ్రహాం, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, డిసిసిబి జిల్లా అధ్యక్షులు నిజాంపాషా,జిల్లా రైతుబంధు అధ్యక్షులు గోపాల్ యాదవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటి ఛైర్మన్ అబ్దుల్ రహమాన్, వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు మీడియా సమావేశానికి హాజరయ్యారు.

## పెబ్బేరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి:జిల్లా ఎస్పీ



**పెబ్బేరు,నవంబర్ 23 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆదేశానుసారం పీఆర్ఓ రాజగౌడ్ సలహాలు సూచనలు అనుసరిస్తూ పెబ్బేరు పట్టణానికి చెందిన యువకులు కానిస్టేబుల్ జె.మధు, పీఈటీ దామోదర్ లు ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమిరనీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పెబ్బేరు పీజేపీ క్యాంప్‌లో ఈవెంట్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇట్టి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ఆశయ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అభ్యర్థులకు ఉచిత దేహదారుఢ్య శిక్షణ ఇస్తున్న కానిస్టేబుల్ జె.మధు, పీఈటీ దామోదర్ లను ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

## శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి: జిల్లా ఎస్పీ



**ఉప్పునుంతల,నవంబరు23 ప్రభాతవార్త:**జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ మనోహర్ అన్నారు. బుధవారం ఆయన ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాల ఏర్పాటు, ప్రస్తుతం పనిచేయని సిసి కెమెరాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అన్నిరకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్ జిల్లా అధికారి మనోహర్‌కు స్థానిక పోలీసులు గౌరవ వందనం చేస్తూ స్వాగతం పలికారు. ఎస్పీతో పాటు అచ్చంపేట డీఎస్పీ కృష్ణ కిశోర్, అచ్చంపేట సిఐ అనుదీప్, ఎస్సై శేఖర్‌గౌడ్, ఎఎస్సై అంజయ్య, హెడ్‌కానిస్టేబుల్ వెంకోజీ, మల్లయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలలో దివ్యాంగులు రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలి..



**వనపర్తిప్రతినిధి,నవంబర్ 23 ప్రభాతవార్త:** క్రీడా పోటీలలో దివ్యాంగులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. బుధవారం వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ,డీఆర్డీఓశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వికలాంగుల క్రీడా పోటీలలో వివిధ విభాగాలలో పోటీలు జరుగుతుండగా అదనపు కలెక్టర్ పోటీలను తిలకించారు. కొద్దిసేపు దివ్యాంగులతో చెస్ ఆడివారిని ఉత్తేజపరిచారు. ఈ పోటీలలో చదరంగం క్యారమ్స్, రన్నింగ్, ట్రై సైకిల్ రేస్, షార్ట్ పుట్,జావెలింగ్ త్రో పోటీలు జరుగుతున్నాయి. పది నుండి 16 సంవత్సరాల వారు జూనియర్స్, 17నుండి 54 సంవత్సరాల వారు సీనియర్స్ విభాలుగా అబ్బాయిలు, అమ్మాయిలు, వేరువేరుగా పోటీలు జరుగుతున్నాయి.

అనంతరం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య రికార్డులు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీలో రికార్డులె అన్ని అప్డేట్ చేసి ఆస్థి పన్ను వసూలు చేయాలని అన్నారు.

## భూములు కోల్పోయిన వారికి ప్రయోజనం కల్పిస్తాం:జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,నవంబరు 23 ప్రభాతవార్త :** మహాత్మాగాంధి కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు అధిక ప్రయోజనం కలిగించేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో ప్యాకేజీ 30లో భూములు కోల్పోతున్న పుల్జాల, హాజిపూర్ రైతులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధి కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్యాకేజీ సంఖ్య 30 పుల్జాల, హాజిపూర్ కాలువకు సంబంధించిన అలైన్మెంట్ విషయంలో రైతులు వెలిబుచ్చిన అభ్యంతరాలు, సూచనలను పేర్లతో సహా రికార్డు చేసి ప్రభుత్వానికి ఉన్నవి ఉన్నట్లుగా పంపించనున్నట్లు వెల్లడించారు. రైతుల సమస్యలు, అభ్యంతరాలు, సూచనలను ఆర్డీఓ ద్వారా మినిట్స్ రికార్డు చేయించారు. రైతుల అభిప్రాయం మేరకు కాలువను గ్రామానికి పై భాగం నుంచి నడివెల్లి మీదుగా కాలువ తీసుకెళ్లేందుకు ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను సర్వే చేయించి నివేదికను సైతం ప్రభుత్వానికి పంపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు వారు కోల్పోయిన వాటికంటే అధికంగా ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. భూ పరిహారం విషయంలో ఆ ప్రాంతంలో అప్పటి వరకు జరిగిన వంద కొనుగోలు అమ్మకాల రేట్లను వ్రాత పూర్వకంగా ఉన్నవి పరిశీలించి సరాసరి రేటును ఎకరా చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రైతులకు నష్టం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం కాదని, రైతుల అభిమతం మేరకు రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం పని చేస్తుందని భరోసా కల్పించారు. భూసేకరణ అనేది పారదర్శకంగా ఉంటుందని, భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల మేరకు పునరావాసం, పరిహారం అందుతుందన్నారు. హాజిపూర్, పుల్జాల రైతులు మాట్లాడుతూ అక్కడ కాలువ అవసరం లేదన్నారు. ఇప్పుడు తయారు చేసిన అలైన్మెంట్ ప్రకారం కేవలం 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు వస్తుందన్నారు. పాత అలైన్మెంట్ ప్రకారం నడివెల్లి మీదుగా చంద్రసాగర్ చెరువును,ఇతర చెరువులను నింపినట్లయితే 27 వేల ఎకరాలకు అతి తక్కువ భూసేకరణ,తక్కువ ఖర్చులతో పూర్తవుతుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాలువ వెడల్పు సైత 280 నుంచి 300ల అడుగుల వరకు తీసుకు వెళ్లాల్సిన అవసరం లేదని, దానివల్ల రైతులు ఎక్కువ భూమిని కోల్పోతున్నారన్నారు. ఇప్పటికే ఉన్న డిండి కాలువతో భూములు జమ్ములు పడుతున్నాయని దానికి సమాంతరంగా మరో కాలువ తీయడం వల్ల లాభం లేదని తమ అభిప్రాయం తెలిపారు. ఈ సమావేశంలో కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్‌కుమార్, అచ్చంపేట ఆర్డీఓ పాండునాయక్, ఇరిగేషన్ ఈఈ సంజీవ్‌రావు, రైతులు మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి..

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 23 ప్రభాతవార్త:** డిసెంబర్ 3వతేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని వికలాంగులను ప్రోత్సహించేందుకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి సూచించారు. బుధ వారం ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానంలో డీడబ్ల్యూఓ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడాపోటీలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రతి రంగంలో రానించాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలలో పాల్గొన్న దివ్యాంగులను ఆయన అభినందించారు. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష మాట్లాడుతూ డిసెంబర్ 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వారికి ఆటల పోటీలు నిర్వహించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ క్రీడా పోటీలను జూనియర్స్ విభాగంలో 10నుండి 16 సంవత్సరాల వయస్సు కలిగినవారు పాల్గొనాలని సీనియర్స్ విభాగంలో 17నుండి54 సంవత్సరాల వయస్సు కలిగిన వారు క్రీడా పోటీలలో పాల్గొనాలని ఆమె సూచించారు.జావేలింగ్ త్రో,షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్, రన్నింగ్, ట్రై సైకిల్ రేస్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దివ్యాంగులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈనెల 23,24వ తేదీలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ పుష్పలత, సీడబ్ల్యూ అలివేలమ్మ, జిల్లా అదనపు డీఆర్‌డీఓ రేణుక, పీఈటీలు, సిబ్బంది, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మెన్, కలెక్టర్

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుత్ను ప్రభుత్వం..

**వచ్చే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం .. కార్యకర్తల సమావేశంలో డిసిసి అధ్యక్షులు డా. వంశీకృష్ణ**

**ఉప్పునుంతల,నవంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని కార్యకర్తలు పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అచ్చంపేట మాజీఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల యశోద ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పరిపాలన చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం ఒరగబెట్టిందేమి లేదన్నారు. పాలకులు ప్రజా దోపిడితో పని చేస్తున్నారని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతం కోసం తీవ్రస్థాయిలో కృషి చేయాలన్నారు. గ్రామాలకు ఉన్న లింకురోడ్లు అద్వాన్న పరిస్థితిలో ఉన్నా పట్టించుకునే పాలకులు కరువయ్యారన్నారు. దీనిపై వర్షానికి దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, రైతులకు, ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో బలపడుతుందని అధికార దాహంతో ఎన్ని కుట్రలు పన్నినా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కార్యకర్తల సమావేశంలో ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్, జిల్లా నాయకులు, మాజీసర్పంచ్ వేముల నర్సింహారావు, కంసాన్‌పల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ, గోపిరెడ్డి రఘుపతిరెడ్డి, గోపిరెడ్డి రమేష్‌రెడ్డి, బిసిసెల్, ఎస్సీసెల్ నాయకులు తిరుపతయ్యగౌడ్, శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ మండల నాయకులు వెల్టూరు రేణయ్య, మొగిలి మహేష్, శేఖర్‌గౌడ్, శ్రీశైలం, ఎన్ఎస్‌యుఐ మండల నాయకులు రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉప్పునుంతల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు వంశీకృష్ణ

## నేడు పాలమూరు విశ్వవిద్యాలయానికి గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ రాక



**మహబూబ్‌నగర్,నవంబరు 23 ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న పాలమూరు విశ్వవిద్యాలయం 3 స్నాతకోత్సవానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ హజరు కానున్నట్లు పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎల్.బి. లక్ష్మీకాంత్ రాథోడ్ తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ తమిళిసై సౌందర్య రాజన్ అధ్యక్షత వహిస్తారని,హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి.జి. రావు స్నాతకోత్సవ ఉపన్యాసం చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పిహెచ్‌డి చేసిన ఆరుగురికి పిహెచ్‌డి పట్టాల ప్రధానంతో పాటు 73 మంది విద్యార్థులకు బంగారు పతకాలను, 2932 మంది పిజి, 30645 యూజి విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

## మన ఊరు మన బడితో సమూల మార్పులు: జిల్లా కలెక్టర్

**నారాయణపేట,నవంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంతో సర్కారు బడుల్లో సమూల మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలోని మక్తల్ మండలంలోని ఎంపిపిఎస్ గుడిబండ్ల, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక జక్లేర్, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, ఎంపిపిఎస్ ప్లేగ్రౌండ్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ముందుగా ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఛైర్మన్ వనజ ఆంజనేయులుతో కలిసి పాఠశాల పనుల గురించి డిఈని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపయాల కల్పన కోసం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు సాధించే విధంగా అందరు పాఠ్యాంశ బోధన చేసేటప్పుడు ఖచ్చితంగా లెసన్ ప్లాన్, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు మాడ్యుల్స్‌ను టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని తెలియజేశారు. విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు సాధించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. తదుపరి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, టిఎస్ ఈడబ్ల్యుఐడిసి డిఈ రాము, ఏఈ శ్రీకాంత్, ఎంపిడిఓ, సెక్రెటరీలు, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో నిర్దేశించిన పనిదినాలు సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి

**ఉప్పునుంతల, నవంబరు23 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి నిర్దేశించిన పనిదినాలను ప్రతి ఒక్కరు సద్వి నియోం చేసుకోవాలని ఉప్పరిపల్లి గ్రామ స ర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. 2022, 23సంవత్సరానికి గాను గ్రామంలో కూలీలకు, రైతులకు ఉపయోగపడే పనుల గుర్తింపు కోసం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ పథకంలో 60 రకాల పనులున్నాయని ముఖ్యంగా చేపల చెరువులు, పాంపండ్స్, ఫీడర్ ఛానల్, పూడికతీత, చెట్ల పెంపకం, పశువుల పాకంలాంటి 200ల రకాల పనులున్నాయని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు పనులు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్లు ఉమాపతిచారి గ్రామసభలో వివరించారు. వారితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

## ఘనంగా లక్షదీపోత్సవ కార్యక్రమం

### పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపిన శ్రీశ్రీశ్రీ పంచమ సిద్దలింగ మహాస్వామి

**మాగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం, నేరడుగం గ్రామంలో నవంబర్ 21 సోమవారం శ్రీ సిద్దలింగేశ్వర స్వామివారి ఆధ్వర్యంలో లక్షదీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీస్ శాఖ వారికి స్వామి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ సిఐ ఎ. సీతయ్య, మాగనూరు మండల ఎస్సై నరెందర్, మక్తల్ ఎస్సై పర్వతాలును పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠ పీఠాధిపతి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపిటిసి కదుమూర్ ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్. విద్యాసాగర్, మాజీ సర్పంచ్ హుసేనప్ప, గొల్ల శంకరప్ప, మల్లేపల్లి నాగప్ప, ముష్టికళప్ప, అంబదాస్, ఈశ్వర్ యదవ్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌శాఖ సిబ్బందిని సన్మానిస్తున్న పీఠాధిపతి

## వెల్టూరు హైస్కూల్ విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు

**ఉప్పునుంతల, నవంబరు 23 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి సేవా సమితి నాగర్‌కర్నూల్ వారు నిర్వహించిన మానవ సేవయే మాధవ సేవ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని నిచతను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం అచ్చంపేట పట్టణంలో జరిగిన శ్రీసత్యసాయి జన్మదిన వేడుకల్లో నిర్వాహకులు రమేష్, నాగరాజు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సూర్యనారాయణ చేతుల మీదుగా వెల్టూరు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని నిచతకు ప్రథమ బహుమతిగా షీల్డ్‌ను అందజేశారు. విద్యార్థిని నిచతను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో పాఠశాల హెచ్‌ఎం రవి శేఖర్, ఉపాధ్యాయులు గోవు సింగోటం, వెంకట్‌రెడ్డి, రామోజీ, జయన్న, అశోక్, పరమేశ్వర్, వసంతకుమారి యాదవ్, జ్యోతిలు ఉన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

## ఘనంగా మహారుద్రాభిషేకం

**వెల్దండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి నివాసంలో బుధవారం కార్తీక మాస ముగింపును పురస్కరించుకొని మహారుద్రాభిషేక కార్యక్రమాన్ని భాస్కరశర్మ ఆధ్వర్యంలో యెన్నం విజయమ్మ భూపతిరెడ్డిలచే నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఎంపీటీసీ ఉమా విజయేందం రెడ్డిలతో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, గ్రామస్తులు అంజనేయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, కాదూరాం, శేఖర్, రవినాయక్, వీరారెడ్డి, రాఘవేందర్, జంగాచారి, కృపానందం, దేవేందర్, శేఖర్, జర్నలిస్టులు మిర్యాల రాజయ్య, తిర్మన్‌దాసు నాగరాజుగౌడ్, శ్రీనివాసులు, వెల్దండ రామకృష్ణచారి, మల్లేష్, తదితరులు ఉన్నారు.



రుద్రాభిషేక కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

## నేడు కాంగ్రెస్ పార్టీ ధర్నాను విజయవంతం చేద్దాం...

**వెల్దండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు గురువారం కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేద్దామని డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్‌తో కలిసి వంశీకృష్ణ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చి తెలంగాణ సంపదను కొల్లగొడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పంట నష్ట పరిహారం, రుణమాఫీలపై ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా రైతులను ఢిపాల్టర్లుగా మిగిల్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ధరణి పోర్టల్, పంట నష్ట పరిహారం, రుణమాఫీల ప్రధాన సమస్యలపైననే కాంగ్రెస్ పార్టీ పిలుపు ఇచ్చిందని, పిలుపులో భాగంగానే జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు ప్రతి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీద్, వెంకటయ్యగౌడ్, శేఖర్, పుల్లయ్య, జయరాంనాయక్, శివనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం..

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు యాదవ్

**శ్రీరంగాపురం, నవంబర్ 23 ప్రభాతవార్త:** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశానుసారం మాజీ మంత్రి చిన్నారెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన నిరంకుశ ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తు ధరణి పోర్టల్ లో అవకతవకలు, పంట రుణమాఫీ పై కాలయాపన తదితర విషయాలపై నేడు తహసిల్దార్ కార్యలయం ముందు నిరసన ధర్నా కార్యక్రమం ఉంటుందని తనంతరం తహసిల్దార్ కి వినతిపత్రం సమర్పణ ఉంటుందని పార్టీలకు అతీతంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నేడు జరిగే ఈ కార్యక్రమం జయప్రదం చేయగలరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాములు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు...

**వనపర్తి టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బహుజన రాజ్యాధికార రథసారథి డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని కేడీఆర్ నగర్‌లో దివ్యాంగుల సర్టిఫికేట్ లు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన సదరం క్యాంపులో దివ్యాంగులకు పండ్లు పంచి పాలిటెక్నిక్ కళాశాల ముందు కేక్ చేసి జిల్లా అధ్యక్షులు నాగనమోని చెన్న రాములు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి గణపురం కృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొల్గర తిరుమలేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బహుజన్ రమేష్, వనపర్తి నియోజకవర్గం పార్టీ అధ్యక్షులు గట్టు మన్యం, జిల్లా బీపీసిఐ అధ్యక్షులు వెంకటేష్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ కలుమూరి కురుమయ్య, వనపర్తి మండల కన్వీనర్ దండు రాజు, గోపాల్‌పేట నాయకులు కురుమన్న, వనపర్తి మండలం ట్రైలర్ కురుమన్న, రమేష్, ఆనంద్, వనపర్తి జిల్లా బీఎసీయు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కేక్ చేసి సంబరాలు చేసుకుంటున్న బీఎస్పీ నాయకులు

# ఘనంగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు..!

**కల్వకుర్తి, నవంబర్ 23, ప్రభాతవార్త:** సత్యసాయిబాబా 976వ జయంతి వేడుకలను కల్వకుర్తి పట్టణంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి మందిరంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా జన్మదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున సుప్రభాత సేవలు, మహానగర సంకీర్తన, శ్రీ షిరిడి సాయిబాబా, శ్రీ సత్యసాయిబాబా వారికి అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు శ్రీ సత్యసాయి వ్రతం ట్రస్ట్ సభ్యులు గుబ్బ ఈశ్వరయ్య, గుబ్బ శంకరయ్యలు నిర్వహించారు. సత్యసాయిబాబా జన్మదిన వేడుకలకు ట్రస్ట్ సభ్యులు గుబ్బ ఈశ్వరయ్య, వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరై జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. భగవాన్ సత్యసాయిబాబా పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పేద ప్రజల కోసం ఆసుపత్రిని స్థాపించి ఉచితంగా గుండెకు శస్త్ర చికిత్సలతో పాటు ఇతర చికిత్సలు నిర్వహించారన్నారు. ఇంతే కాకుండా మంచినీటి సౌకర్యాన్ని కల్పించి దాహార్తిని తీర్చారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా విద్యానందిస్తూ భవిష్యత్తుకు బాటలు వేశారు. ఆయన స్థాపించిన అనేక సంస్థల ద్వారా సత్యసాయి భక్తులు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. సత్యసాయిబాబాకు దేశ విదేశాల్లో భక్తులు ఉన్నారని, నిరంతరం ఆయనను స్మరించుకుంటూ ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తున్నారని వారు తెలిపారు. అనంతరం చిన్నారులచే డోలారహణం, చిన్నారులచే కేక్ కటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కూన చంద్రశేఖర్, దాచేపల్లి మనోహర్, గుగ్గిళ్ళ శంకర్, లక్ష్మన్ బాపూజీ, గుబ్బ వెంకటేష్, గోవిందు చంద్రయ్య, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, శివ్వ జగదీశ్వర్, వెల్దండ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పీఆర్ఓ మిర్యాల రాజయ్య, సభ్యులు జూలూరి బాలస్వామి, వీరెడ్డి మధు, పాపిశెట్టి శ్రీనివాస్, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పూజ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకల్లో వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆలయ నిర్వాహకులు

# టీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై...

### -ఎమ్మెల్సీ సమక్షంలో పలు పార్టీల నాయకుల చేరికలు

**వెల్దండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా గడపగడపకు చేరడాన్ని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వెల్దండ మండల పరిధిలోని కేస్లీ తాండ సర్పంచ్ బుజ్జి లక్ష్మన్‌నాయక్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ 76 సంవత్సరాల చరిత్రలో తెలంగాణలో ఎన్నడు అమలు కానీ సంక్షేమ పథకాలు అభివృద్ధి కేవలం 8 సంవత్సరాల్లోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. టీఆర్ఎస్ పార్టీ రూపాంతరం చెంది బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారి త్వరలో జరగనున్న రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించనుందని, ప్రధానిగా సీఎం కేసీఆర్‌ను ప్రజలు అకాంక్షిస్తున్నారన్నారు. దేశంలో 18 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా తెలంగాణ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. దేశంలో ప్రధాని మోడీ కులాలు, మతాల మధ్య విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని, ప్రజలు వారికి త్వరలోనే బుద్ధి చెప్పి తరిమివేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కంటోనిపల్లి గ్రామసర్పంచ్ పెద్ది రామకృష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు మత్రునాయక్, వెంకట్‌నాయక్, బాల్యనాయక్, తిరుపతి, రవి, పాండునాయక్, భీమ్లానాయక్, సీత్యనాయక్, శ్రీనునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీకసిరెడ్డి నారాయణరెడ్డి

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం

**కల్వకుర్తి, నవంబర్ 23, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన వట్టెపు అల్లాజీ గత కొద్ది కాలం నుంచి అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. బుధవారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వట్టెపు అల్లాజీని పరామర్శించి ఐక్యత ఫౌండేషన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మార్చాల గ్రామస్తులు నిజామొద్దిన, ఖలీల్, రామానుజన , నామని శ్రీనివాసులు, ఆదిరాల యాదయ్య, రామస్వామి, ఆవ తిరుపతి, మేకల స్వామి, భీరయ్య, సుల్తాన్, బంగారి, దేశమోని రామస్వామి, భీమయ్య, ఈశ్వరయ్య, ఫౌండేషన్ సభ్యులు ఆవ గణేష్, హసన్ తదితరులు ఉన్నారు.



## తిప్పాపూర్‌లో సామూహిక వ్రతాలు

**ఉప్పునుంతల, నవంబరు 23 ప్రభాతవార్త :** మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో బుధవారం సాయి మందిరంలో సాయిబాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తిప్పాపూర్ సేవా సమితి సభ్యులు మనోహర్‌సింగ్, కృష్ణసింగ్, శంకర్ యాదవ్, బాబుసింగ్, తులసిరామ్, వెంకటేశ్వర్‌సింగ్, హైద్రాబాద్‌కు చెందిన మనోహర్, ఎర్రయ్య, అడ్వకేట్ శ్రీధర్‌రావు, ఉప్పునుంతల మండల రేషన్‌డీలర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి కుమారస్వామి, పాపిశెట్టి మధు, ఏడుకొండలు, తాడూరు నుంచి వెంకట్, తిరుపతయ్య, కొరిటికల్‌కు చెందిన రవిచారి, శివచారి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బస్వాపూర్‌లో ఘనంగా ఆంజనేయస్వామి పల్లకిసేవ

**దేవరకద్ర, నవంబరు23 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బస్వాపూర్‌లో బుధవారం ఆంజనేయస్వామి పల్లకిసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహింరు. సర్పంచ్ హన్మంతు అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకపూజలతో పాటు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ హన్మంతుతో పాటు గ్రామస్థులు శాంతన్న, కృష్ణయ్య, వెంకట్ రాములు, అనంతయ్య, నరసింహ్మ రాజు, రాజేందర్, భ్రహ్మయ్య, శంకరయ్య, రాజు, నరేష్, మధు, అంజి, కథలయ్య, బాలస్వామి, నరసింహ్ములు తదితర గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## నార్లోనికుంటలో కొనసాగుతున్న శివాంజనేయస్వామి ఉత్సవాలు

### - వైభవంగా అఖండభజన -రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**దేవరకద్ర, నవంబరు 23 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని నార్లోనికుంటలో శివాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే నార్లోనికుంటలో శివాంజనేయస్వామి ఉత్సవాలలో భాగంగా అఖండభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 21నుండి దేవస్థానంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను కూడ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విగ్రహాన్ని వెండి ఆభరణాలు, రకరకాల పూలతో అలంకరించారు. శివాంజనేయస్వామి ఉత్సవాలలో భాగంగా దేవస్థానంలో వేదపండితుల అధ్వర్యంలో శివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞం సామూహిక గీతావహనం కార్యక్రమాన్ని కూడ సాంప్రదాయరీతిలో నిర్వహిస్తున్నారు. శివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు, హైద్రాబాద్‌లోని ఘట్‌కేసర్ ఆత్మభోధ పీఠం సదానంద యోగీశ్వరుల అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అఖండ భజన కార్యక్రమాన్ని కూడ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విధ్యుత్ బల్బులతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి..** దేవరకద్ర మండలంలోని నార్లోనికుంటలో శివాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తెల్లవారుజామున ఈ రథోత్సవం జరుడనుంది. ఈ సందర్భంగా స్వామివారి రథానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. రథోత్సవం రోజు శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామివారిని గ్రామ పురవీధుల గూండా ఊరేగిస్తారు. అనంతరం పల్లకిసేవ, స్వామి వారి ఊరేగింపు తదితర పూజా కార్యమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు, ఉత్సవ నిర్వహకులు తెలిపారు. కావున భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శివాంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.



నార్లోనికుంటలో పూజలు చేస్తున్న భక్తులు

# ప్రకృతిని కాపాడడమే తమ లక్ష్యం:ఎఫ్‌డిఓ నవీన్‌రెడ్డి

### అచ్చంపేటలో నిరసన తెలిపిన ఫారెస్టు సిబ్బంది

**అచ్చంపేట, నవంబరు 23 ప్రభాతవార్త :** ప్రకృతిని కాపాడడం కోసమే తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నామని ప్రస్తుతం తమకు రక్షణ లేకుండా పోయిందని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అటవి శాఖ సబ్ డివిజనల్ అధికారి నవీన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అచ్చంపేట పట్టణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తి కోయల దాడిలో గాయపడి మృతి చెందిన ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ మృతికి నిరసనగా ఫారెస్టు సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిఓ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ అటవి సంరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవిశాఖ పర్యావరణ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతున్న తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ రక్షణ కోసం ఆయుధాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేంజ్ అధికారి హత్యకు నిరసనగా నేటినుంచి పోడుభూముల గ్రామసభలు, భూసర్వేలను నిలిపివేస్తున్నామని ఆయన అన్నారు. గుత్తికోయల దాడిలో మృతిచెందిన శ్రీనివాస్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనిరసనలో ఎఫ్‌డిఓతో పాటు రేంజర్లు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.





తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్న అచ్చంపేట ఎఫ్‌డిఓ

## 28న దేవరకద్రలో అయ్యప్పస్వామి పడిపూజ

**దేవరకద్ర, నవంబరు 23 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఈ నెల 28న అయ్యప్పస్వాముల పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక గురుస్వామి కొవ్వూరు కరణంరాజుస్వామి తెలిపారు. ఆ రోజు ఉదయం ముందుగా అయ్యప్పస్వాముల శోభాయాత్రతో పాటు పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సాంప్రదాయరీతిలో అయ్యప్పస్వాముల పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం భిక్ష(అన్నసంతర్పణ) కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కావున ఈ కార్యక్రమానికి అయ్యప్పభక్తులతో పాటు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కరణంరాజు స్వామి కోరారు.



# ఆసుపత్రిని సందర్శించిన పివైఎల్,పిఓడబ్ల్యు బృందం

**నారాయణపేట, నవంబరు 23 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో గల 100 పడకల ఆసుపత్రిని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు)సంఘాల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో గల వంద పడకల ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులపై సర్వే నిర్వహించగా దారుణమైన నిజాలు బయటపడ్డట్లు తెలిపారు. వంద పడకల ఆసుపత్రిలో కేవలం రెండు బాత్రూంలు ఉన్నాయంటే ఆసుపత్రి పరిస్థితి అర్థ చేసుకోవచ్చు. ఇక కనీసం తాగడానికి మంచినీరు కూడా లేని పరిస్థితి అక్కడ ఉందన్నారు. బాలింతలకు వేడినీళ్లు కావాలంటే బయట కొనుక్కుని తాగాల్సిన దుస్థితి ఉందంటే అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో ఆసుపత్రుల రూపురేఖలు మార్చామని చెప్పుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు నారాయణపేట జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి చూస్తేనే అర్థమవుతుందని బృందం సభ్యులు తెలిపారు. స్థానిక సూపరింటెండెంట్‌తో మాట్లాడితే సమస్యలన్ని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌లకు వివరించడం జరిగిందని ప్రభుత్వమే స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, మా చేతుల్లో ఏమి లేదని అన్నారు. డ్రైనేజీ పరిస్థితి పూర్తిగా దెబ్బతినడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆసుపత్రి భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయి. దీంతో అక్కడ పనిచేసే సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యలు కల్పించి తగిన సిబ్బందిని నియమించి సామాన్య ప్రజల ప్రాణాలు కాపాడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాశినాథ్, కోటకొండ ఎంపిటిసి కె. సునితక్క, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సౌజన్య, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ప్రతాప్, సహాయ కార్యదర్శి సలీం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇస్మాయిల్, హనుమంతు, రాము, అచల, భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు సి. కనకప్ప పాల్గొన్నారు.





వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తున్న దృశ్యం

# దివ్యాంగులు ఎంతో ప్రతిభావంతులు

## ●విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి చర్యలు : నాగర్‌కర్నూల జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త:** దివ్యాంగులు ఎంతో ప్రతిభావంతులని కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ అన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ బుద్ధిమాంద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న బధిరుల క్రీడా పోటీలు జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కలెక్టర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో దాగిఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీయ డానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ట్రై సైకిల్, జావలిన్‌త్రో, చెస్, క్యారమ్స్, షార్ట్‌పుట్, 50మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాలు, ట్రై సైకిల్ క్రీడా పోటీలను నిర్వహించారు. అంధ, బుద్ధిమాంద్యం, శారీరక దివ్యాంగ విజేత లకు డిసెంబర్ 3న ఏర్పాటు చేసే కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఈక్రీడా పోటీల్లో 450 మంది దివ్యాంగులు పాల్గొన్నారని జిల్లా ఇంఛార్జి, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారిని దమయంతి తెలిపారు. అనంతరం 35 మంది దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ కల్పనా భాస్కర్‌గౌడ్, జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారిని దమయంతి, ఆర్టీసి డిఎం ధరంసింగ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు సీతారాంనాయక్, వెంకటయ్య, శేఖర్‌బాబు, సుభాషిని, సరిత, సత్యనారాయణ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు కందనూలు నిరంజన్, రాజశేఖర్, గౌతమ్, బాలీశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, జిల్లా కోశాధికారిగట్టు రఘునందన్‌రెడ్డి, కొల్లాపూర్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి నారాయణమ్మ, నాగర్‌కర్నూల్ టౌన్ ప్రెసిడెంట్ భీమ్‌సాగర్, శంకర్, నిర్మల, నిరంజన్, బాలపీరు దివ్యాంగులు పాల్గొన్నారు.


క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు


బధిరుల క్రీడా పోటీలను జెండాఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్


క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

## ఇంటిగ్రేటెడ్ రైతు బజార్ కోసం మంత్రికి వినతి

**ఖిల్లాఘణపురం, నవంబర్23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రైతు బజార్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి సర్పంచ్ డా.వెంకటరమణ వినతిపత్రం అంద జేశారు. గ్రామ పంచాయితీ కార్యాలయం సమీపంలో సంత బజార్ నిర్వహిస్తూ ప్రతి ఆదివారం వేలాదిమంది క్రయవిక్రయాలు జరుపుకునే స్థలం కావడంతో మోడల్ ఇంటిగ్రేటెడ్ రైతు బజార్ నిర్మానానికి కావాల్సిన షెడ్ల


మంత్రికి రైతు బజార్ నిర్మాణం కోసం వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ

కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, మటన్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రిని కోరారు. ఇంటిగ్రేటెడ్ రైతు బజార్ నిర్మాణం కోసం ప్రతి పాదనలు సిద్ధం చేసి పంపించాలని అధికారులను మంత్రి నిరంజన్ రెడ్డి ఆదే శించారని సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రే టెడ్ రైతు బజార్ అవసరం ఎంతైన ఉందని సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకులబ్ది చేకూరుతుందని, షెడ్ల నిర్మాణంతో పాటు పబ్లిక్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు.

## ఘనంగా డాక్టర్ ఆర్ఎస్‌పి జన్మదినోత్సవం

**శ్రీరంగాపురం, నవంబర్23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం అంబేద్కర్ చౌరస్తాలో బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు మండల కోకన్వీనర్ గుడిసె ధర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరి గింది. ఈ కార్యక్రమానికి బహుజన సమా జ్ పార్టీ వనపర్తి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ వనపర్తి నియోజకవర్గం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరంగాపురం ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి ముఖ్య అతిథులు హాజరయ్యారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ సీనియర్ ఆర్.పీ. బీసన్న, సెక్టార్ అధ్యక్షుడు గంధం స్వామి, వార్డు మెంబర్ చంద్రశేఖర్, టౌన్ పార్టీ కన్వీనర్ కె.భాస్కర్, ముని, పవన్, వెంకటాపురం దేవదాస్, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## అటవీశాఖ అధికారి శ్రీనివాసరావు హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**వనపర్తి టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** కొత్తగూడెం జిల్లాలో జరిగిన అటవీశాఖ అధికారి శ్రీనివాస్‌రావు హత్యకు కారణం రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. బంజారా గిరిజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడిచిన ఎనిమిదిన్నర సంవత్సరాలుగా పోడు భూముల సమస్యలను పరిష్కరించకుండా గిరిజనులను మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నేటి దురదృష్టకర సంఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం సిగ్గుచేటు అని అన్నారు. తరతరాలుగా అవే భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న గిరిజనులను రాష్ట్రం ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుండటమే ఇందుకు కారణం కల్లబొల్లి కబుర్లతో కాల్యాన్ని చేస్తూ పోడు భూముల సమస్యను పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వంని రాబోయు ఎన్నికల్లో అదే గిరిజన సమాజం రాజకీయ సబాధి చేయడం ఖాయమని ఆయన అన్నారు.



## దక్షిణ కాశీలో ప్రత్యేక పూజలు

**వెల్దండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా విరజిల్లుతున్న గుండాల అంబరామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆమనగల్లుకు చెందిన ప్రముఖ వ్యాపా రవేత్త, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాపిశెట్టి రాముస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాపిశెట్టి రామును శాలు వాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ నాయకులు పూరి రమేష్, ఆలయ అర్చకులు శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, పూరిశర్మ, నరహరిశర్మ, తదితరులు ఉన్నారు.



## శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయిబాబా 97వ జన్మదినోత్సవం

**గండీడ్, నవంబరు 23 ప్రభాతవార్త :** శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయిబాబా 97వ జన్మదినం సందర్భంగా వెన్నచెడ్ గ్రామంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గం.లనుంచి నగర సంకీర్తన, స్వామివారి శతనామావళి, స్వామివారి పల్లకి సేవాక్వాశ్రమము నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి, కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సర్పంచ్ పుల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు, కోస్గి జడ్పీటిసిసభ్యులు ప్రకాష్‌రెడ్డి, జాబిరెడ్డి, రాములుసత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

## చీడ పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**లింగాల, నవంబరు23 ప్రభాతవార్త:** పంటలకు చీడపురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సురాపూర్ గ్రామ శివారులోని రైతులు పండించిన వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వేరుశనగ పంటలకు ప్రస్తుతం లద్దెపురుగు ఆశించి పంటలను నష్టపరుస్తాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధించాలి

## ◆వాల్మీకి బోయలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి ◆వాల్మీకి బోయల డిమాండ్

**వనపర్తి టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** వాల్మీకుల నిరాహార దీక్ష వనపర్తిలో భాగంగా బుధవారం 14వ రోజు చిన్నంబావి మండలం వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఐక్య కార్యచరణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వాల్మీకి బోయలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని వాల్మీకి బోయలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేసీఆర్ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చెల్లప్ప కమిటీని వేసి నేటికీ 7 సంవత్సరాలు కాలయాపన అన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని బుధవారం నాటికి 14వ రోజుకు చేరిన నిరాహార దీక్ష పై రాష్ట్రం ప్రభుత్వం నుండి ఎలాంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా వాల్మీకి కొత్తగా ఎస్టీ జాబితాలో చేర్చమని అడగడం లేదను 1956కు ముందు వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో ఉండేవారని రాజకీయ రాయకుల కక్షసాధింపు వలన వాల్మీకులు బీసీలుగా గుర్తించబడి వెనుకబాటు తనానికి ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరుడుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల సభాధ్యక్షులు పెంట్లవెల్లి వెంకటేష్ నాయుడు, నాయకులు టికె కురుమన్న, వేణుపాల్, రామ్మూర్తి నాయుడు, నీలస్వామి, మండల దేవన్న నాయుడు, ఉమ్మల్ల రాములు, బాలస్వామి నాయుడు, రవి కుమార్, రఘపతి నాయుడు, చిన్నంబావి మండలవాల్మీకి నాయకులు రాజ్ కుమార్, రామకృష్ణ, సత్తి, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో పాల్గొన్న వాల్మీకి బోయలు

# జర్నలిస్టుల మహాసభ కరపత్రాల విడుదల

**ఇటిక్యాల, నవంబరు23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోదండపురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం అలంపూర్ సిఐ సూర్యనాయక్, కోదండపురం ఎస్సై వెంకటస్వామి చేతులమీదుగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ మహాసభకు సంబంధించి యూనియన్ నాయకులు మహాసభ కరపత్రాలను సిఐ, ఎస్సై విడుదల చేశారు. ఈనెల 27న హైదరాబాద్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మహాసభ ఏర్పాటు చేయడంతో జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు సూచన మేరకు తెలంగణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ రంగముని, జర్నలి స్టులు మధు, రామాంజనేయులు కలిసి కోదండపురం సిఐ కార్యాలయంలో అలంపూర్ సిఐ సూర్యనాయక్, కోదండపురం ఎస్సై వెంకటస్వామిలను కలిసి మహాసభ కరపత్రాలను వారి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారది. గా ఉంటూ అనునిత్యం ఎక్కడ ఏం జరిగినా సమాచారాలను సేకరించి ప్రచురింపచేసి సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పని చేస్తున్న జర్నలిస్టులు వారి సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జర్నలిస్టులందరు ఒక చోట సమావేశమై ఆలోచనలు పంచుకోవడం శుభపరిణామం అన్నారు. నియమ నిబంధనలు పాటించి యూనియన్ మహాసభలను జయప్రదం చేసుకోవాలని అలంపూర్ సిఐసూర్యనాయక్ కోరారు. కార్యక్రమంలో టిడబ్ల్యు జెఎఫ్ కౌన్సిల్ మెంబర్ రంగముని, నవతెలంగాణ రిపోర్టర్ మధు, రిపోర్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐ, ఎస్సై

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలి

**అమరచింత, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాఘవ మాట్లాడుతూ అమరచింత ప్రభుత్వ పాఠశాలలో హైస్కూల్ మధ్యాహ్న భోజనం సరిగా లేకపోవడం తాగడానికి నీళ్ల లేకపోవడం కూరలు మొత్తం నీళ్ల ఉండడం వల్ల చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఇంటికెళ్లి తింటున్న పరిస్థితి ఉంది అదే విధంగా హైస్కూల్ రోజు రోజు క్లాస్సెస్ ఊడ్చకుండా పరిశుభ్రత లేకపోవడం వల్ల విద్యార్థులకు దోమలు, ఈగలు ఎక్కువ ఉండడంతో విద్యార్థులు అనారోగ్యానికి గరవుతున్నారని అన్నారు. అమరచింత ప్రభుత్వ హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమరచింత మండల కేంద్రంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలనాయకులు అక్బర్, వినయ్, రమేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం

## ●గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : డీపీఓ సురేష్ కుమార్


పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ సురేష్

**ఖిల్లాఘణపురం, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయితీ కార్యదర్శుల తో బుధవారం గ్రామాల్లో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ సురేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడాప్రాంగణాల పనులను పూర్తి చేయని గ్రామాల్లో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సరీలు టికెపీ హరితహారం రెట్రో ఫిట్ ఎన్‌బిఎం డంపింగ్ యార్డ్ వైకుంఠదామాల నిర్వహణపై సమీక్ష చేశారు. గ్రామాల్లో నిర్మించిన వైకుంఠదామాలను వినియోగంలోకి తేవాలని అన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించాలని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. క్రమం తప్పకుంగా మురికి కాలువలను శుభ్రం చేయాలని అన్నారు. రోడ్లపై చెత్తా చెదారం వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పంచాయితీ కార్యదర్శులు ఉదయం 8గంటల వరకు గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. అంతకుముందు గణపురం గ్రామ పంచాయితీ కార్యలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ పంచాయితీ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులను పంచాయితీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్ ను సందర్శించి మార్కెట్ అభివృద్ధికి చేపట్టవలసిన పనులను పరిశీలించారు. రాబోయే రోజుల్లో కూరగాయాల మార్కెట్ ఆవరణలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ కుమార్, సర్పంచ్ వెంకటరమణ, ఏపో సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి రవితేజ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని భైరాపూర్ గ్రామ సర్పంచ్ దార్లకుమార్ జన్మదినోత్సవం సందర్భంగా భైరాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకుంటామని, విద్యార్థులందరు కష్ట పడి చదవాలన్నారు. వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో దార్ల కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మండల అధ్యక్షులు ఉప్పుఆంజనేయులు, టీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్‌రాంచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ్మ ముదిరాజ్, రాజునాయక్, నాయకులు పత్యనాయక్, నాయకులు అలీ, కాదూరాం, తిర్మల్‌రావు, భీమ్లనాయక్, తదితరులు ఉన్నారు.

## ప్రజలకు సేవ చేయడమే డీఎన్ఆర్ లక్ష్యం


ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఊర్కొండ, నవంబర్ 23, ప్రభాతవార్త:** ఊర్కొండ మండలం బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన గంగాపురం జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి మృతుని కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేందర్, సత్యం, ఆంజనేయులు, ఆంజనేయులు, ప్రశాంత్, శంకర్ తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్ సాధించే వరకు పోరాటం


ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, నవంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అధిక సీట్లు కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామ కమిటిని జిల్లా అధ్యక్షుడు శంకర్‌యాదవ్, మండల అధ్యక్షుడు దుద్దు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటి అధ్యక్షుడిగా దుద్దు భీముడు యాదవ్, ఉపాధ్యక్షులుగా దుద్దు లక్ష్మణ్ యాదవ్, దుద్దు సాయిబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి దుద్దు శ్రీశైలం యాదవ్, గౌరవ అధ్యక్షులుగా దుద్దు నిరంజన్ యాదవ్, దుద్దు గాలయ్య యాదవ్, దుద్దు ఆంజనేయులు యాదవ్, తిరుపతయ్య యాదవ్, వెంకటయ్య యాదవ్, శేఖర్ యాదవ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జక్కుల లింగమయ్య, ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకటేష్, గడ్డం శేఖం యాదవ్, దుద్దు రమేష్‌యాదవ్, దుద్దు శ్రీనివాస్ యాదవ్, మామిళ్లపల్లి యాదవ్ సోదరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**మహ్మదాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముందలి తండా గ్రామానికి చెందిన తెరాస యువ నాయకులు బబ్లూనాయక్ తల్లి అకాల మరణం చెందడంతో భౌతిక కాయాన్ని సందర్శించి బబ్లూనాయక్‌కు నేనున్నానని ధైర్యచెప్పి, జరగాల్సిన కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందజేశారు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి. ఎమ్మెల్యేతో పాటు జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మహ్మదాబాద్ తెరాసా పార్టీ అధ్యక్షులు బిక్షపతి, సింగిల్ విండో వైస్ చైర్మన్ నాగరాజు, యువ నాయకులు కృష్ణ, కడవత్ గోపాల్, గ్రామ సర్పంచ్ నీలేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ పాగుంట లక్ష్మీవెంకటేశ్వర స్వామి వారికి 9 తులాల బంగారాన్ని ఇచ్చిన దాతలు

**కేటిదొడ్డి, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలిసిన శ్రీశ్రీపాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి బంగారు కిరీటం చేయుటకు వివిధ గ్రామాల భక్తులు ధరూర్ మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మిర్జపూరం రామచంద్రారెడ్డి ఐదు తులాలు, కేటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన కావలి నరసింహులు తులం బంగారం, వెంకటాపురం గ్రామానికి చెందిన మేకల ఎల్లప్ప అర తులం బంగారం, గోపిరెడ్డి అరతులం బంగారం, చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన రంగస్వామి అర తులం బంగారం, జమ్మి చేడు గ్రామానికి చెందిన రంగస్వామి అరతులం బంగారం, రాయచూర్ జిల్లాకు చెందిన సుజాత శ్రీనివాసులు తులం, వెంకటాపురం సంజీవులు పావు తులం బంగారాన్ని బహుకరించారు. కార్తీక అమావాస్య సందర్భంగా బుధవారం దేవాలయంలో దాతలందరికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ సభ్యులకు అందజేయగా వారందరిని శాలువాతో సన్మాం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు శేషిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## శిల్పారామం పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్



శిల్పారామం పనులను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు

**మహబూబ్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** శిల్పారామం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన మిని ట్యాంక్‌బండ్‌వద్ద పురోగతిలో ఉన్న శిల్పారామం పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిల్పారామం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా శిల్పారామం ఆర్చ్, ప్రధాన ఆర్చ్ పనులను పూర్తి చేయాలని చెప్పారు. అలాగే ప్రదర్శనశాల పనులను పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, శిల్పారామం ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## పోడుభూముల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

### ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించండి : జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోడు భూముల పరిష్కారానికి అధికారులు గ్రామసభలు నిర్వహించి, తీర్మాణాల నివేదికలను డివిజనల్ స్థాయి కమిటికి అందించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాష సంబంధిత అధికారులకు సూచించారు. బుధ వారం ఐడిఓసి ప్రజావాణి సమావేశ మందిరంలో పోడు భూములపై అన్ని శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పక్కాగా వివరాలు నమోదు చేయాలని ఆమె సూచించారు. జిల్లాలో పూర్తి స్థాయిలో సర్వే పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారి వివరాలను గ్రామసభలో తీర్మాణం చేసి, జిల్లాస్థాయి కమిటికి అందజేయాలని ఆమె సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం 2005 ప్రకారం పోడు వ్యవసాయ సాగు చేసుకుంటున్న అర్హులైన వారిని 2005 కంటేముందు సాగులో ఉన్న ఆధారాల ప్రకారం ఆమోదించాలని ఆమె తెలిపారు. గ్రామ సభలలో దరఖాస్తు దారులతో పాటు కమిటి సభ్యులందరు హాజరు కావాలని ఆమె తెలిపారు. గ్రామ సభలన్ని పూర్తిచేసి జిల్లాస్థాయి కమిటికి అందించాలని ఆమె సూచించారు. అర్హులైన వారికి న్యాయం జరగరాదని, అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టాలు అందజేయడం జరుగతుందని ఆమె సూచించారు. కార్యక్ర మంలో జిల్లా అటవిశాఖ ఇంఛార్జి అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్డీఓ పద్మావతి, అటవిశాఖఅధికారులు, జిల్లాఅధికారులు, పంచాయతీసెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నల్లవెల్లి రోడ్డు అంబేద్కర్ విగ్రహం సమీపంలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 లక్షల రూపాయలతో కొత్తగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినోత్సవం

**కోయిల్‌కొండ, నవంబరు 23 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కోయిలకొండలో రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 55వ జన్మదిన వేడుకలను మండల బీఎస్పీ పార్టీ అధినేత రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో భారీ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల బీఎస్పీ పార్టీ కన్వీనర్ పానుగంటి రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో బహుజన రాజ్య స్థాపన కోసం తన అత్యున్నత పదవిని ప్రజలకోసం త్యాగం చేసిన మహానాయకుడు డా.ఆ ర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని తెలిపారు. ప్రజాసేవ కోసం నిరంతరం పాటుపడుతున్న డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోమండల బీఎస్పీ పార్టీనేతలు వీరన్న, అర్జున్, రంగస్వామి, హరీష్, వడన్న, ఆంజనేయులు, బాలయ్య, సురేష్, రాజు, రాములు, శ్రీనివాసులు, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామకొండ దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**కోయిల్‌కొండ, నవంబరు 23 ప్రభాతవార్త:** రామకొండ దివ్యక్షేత్రంలో కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా బుధవారం ఆలయ అర్చకులు డిఎం రాఘవేంద్రరావు శ్రీ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాలు గావించిన అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీరామకొండ దివ్య క్షేత్రంలో శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## చెకుముఖి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**కొత్తకోట, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్సు సంబరాల్లో జడ్పీహెచ్ఎస్ మిరాసిపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు గణేష్, భార్గవి, క్రీస్తుకృపలు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కృష్ణయ్య, ఎస్ఎంసీ చైర్మెన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, హనుమంతు, భాస్కర్, అమృతరాజ్, రాజశేఖర్, నిస్సాల్, సుభాష్‌చంద్రబోస్, చంద్రకళ, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

**కొత్తకోట, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పామాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీచ్ ఫర్ ఛేంజ్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించినట్లు హెచ్ఎం లక్ష్మయ్య తెలిపారు. డ్యాన్స్, సింగింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన భార్గవి, గణేష్, గాయిత్రి అనే విద్యార్థులకు ప్రదమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సర్టిఫికేట్లను హెచ్‌ఎం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృధ్విమాత, నుస్రత్‌బేగం, రాజశేఖర్ సాగర్ ఉన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**ఉప్పునుంతల, నవంబరు 23 ప్రభాతవార్త:** స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఉపతహసిల్దార్ సరస్వతి, మండల రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సరితానంతరెడ్డి, అచ్చంపేట పాలశీతలీకరణ చైర్మన్ కట్టగోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు దర్శనమిచ్చిన శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి

**కెటిదొడ్డి, నవంబరు 23 ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామం కొండపై వెలిసిన శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం అమావాస్య సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు తరలిరావడంతో దేవాలయంలో భక్తులతో కిటకిటలాడుతూ కనిపించారు. కార్యక్రమంలోని భాగంగా స్వామివారికి అభిషేకం, అర్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఆలయ పెద్దలు శేషిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, పద్మారెడ్డి, గోపి, శ్రీను, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అయ్యప్ప మహాపడిపూజలో మంత్రి నిరంజన్‌రెడ్డి

### శరణు ఘోషతో పులకించిన దొడగుంటపల్లి

**పెద్దమందడి, నవంబరు 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ వరలక్ష్మి ఇంటి దగ్గర నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామిని దర్శించుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి అయ్యప్పస్వాములు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప స్వాములు మంత్రిని ఘనంగా సన్మానించారు. బుధవారం ఉదయం నుండి గ్రామంలో పండగ వాతావరణం సంతరించుకుంది. ఉదయం స్వామివారిని పల్లకి సేవలో ఊరేగించారు. అయ్యప్పస్వామి భక్తిగీతాలు, భజనలతో గ్రామంలో అయ్యప్ప నామస్మరణ, శరణుఘోష వినిపించింది. గ్రామస్తులతో పాటు వివిధ పార్టీల రాజకీయ నాయకులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పూజలో గురుస్వాములు ముత్తుకృష్ణస్వామి, అశోక్‌రెడ్డి స్వామి, చెన్నారెడ్డి గురుస్వామి, ఎంపిపి మేఘారెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మన్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలపై అవగాహన కోసమే న్యాయ సదస్సులు

### ●జూనియర్ సివిల్ జడ్జి కె.స్వరూప



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కె. స్వరూప



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త :** ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం కోసమే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కె. స్వరూప వెల్లడించారు. నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామ రైతు వేదికలో బుధవారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ విజ్ఞాన సదస్సులతో పాటు చట్టాలపై అవగాహన కల్పించ డానికి కార్యక్రమాలతో నేరుగా ప్రజల వద్దకు వస్తున్నామన్నారు. చట్టం ముందు అందరు సమానులేనని, కోర్టులో కేసులపై కొట్లాడలేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చట్టాల గురించి తెలియకపోవడం వల్లేప్రజలు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. క్రయ విక్రయాలు, లావాదేవీలలో మోసాలకు గురవుతున్నారని, వివాదాల్లో ఇరుక్కుని ఆస్తుల కోసం కోర్టుల చుట్టు తిరుగుతున్నారన్నారు. అందుకే గ్రామాల్లో న్యాయ సలహాలు అందించడానికి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కల్తీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయిన క్రమంలో వారు పరిహారం పొందడానికి వీలుగా వినియోగదారుల హక్కుల గురించి చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్, మెగా లోక్‌అదాలత్‌ల ద్వారా రాజీకి వీలున్న క్రిమినల్ కేసులతో పాటు అన్ని సివిల్ కేసులను వాయిదాలతో నిమిత్తం లేకుండా ఇరువర్గాలు రాజీకి ముందుకు వస్తే వాటిపై తుదితీర్పు ఇస్తామన్నారు. దీనిపై తిరిగి అప్పీలుకు ఆస్కారం ఉండదని, రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ఉభయులూ కేసులో విజయం సాధిస్తారని తెలిపారు. కేసుల సంఖ్య తగ్గితే ప్రభుతవంపై భారం తగ్గుతుందన్నారు. ఉచితంగా అందించే సేవల గురించి ప్రజలకు తెలియజెప్పడానికి కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి స్వరూప సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి మౌనిక మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాల తర్వాతనే వివాహాలు జరిపించాలని సూచించారు. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు అందరూ చట్ట పరిధిలోనే జీవించాలన్నారు. కార్యక్రమంలో బార్ ఎంపిపి నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ నిర్మల, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా, న్యాయవాదులు రాజశేఖర్, హర్షవర్ధన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, తిరుపతయ్య, హమీద్ అలీ, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### ●రెవెన్యూ డివిజనల్ అధికారిని పద్మావతి



:సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

**వనపర్తి టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే మహబూబ్‌నగర్- హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు -2022 డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా సిద్దం చేసినట్లు రెవెన్యూ అధికారిని పద్మావతి సూచించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఆర్డీఓ ఛాంబర్ లో అనిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా 2022ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఏవైనా సవరణలు ఉంటే వెంటనే పూర్తి చేసి డిసెంబర్ 9వ తేదీలోగా అందించాలని ఆమె సూచించారు. 3 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళ్యాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మాత్రమే ఎమ్మెల్సీ ఓటర్ నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. అర్హులైన వారు ఫామ్-19లో ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడం జరిగిందని ఆమె సూచించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాలలు, ఇంజనీరింగ్ కళ్యాశాలలు, మెడికల్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లు ఓటు నమోదు చేసుకున్నట్లు ఆమెతెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఆర్ఓ రాజేందర్‌గౌడ్, వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు జబ్బార్, జ్యోతి, జమీల్, విజయరాములు, చిరంజీవి, తిరుపతయ్య, రహీం, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం విజయవంతం



మాట్లాడుతున్న డీఎమ్‌హెచ్ఓ డా.రవిశంకర్

**వనపర్తి టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం విద్యాశాఖ-సమగ్ర శిక్ష ,ఎల్ఐఎమ్‌సీఓ వారి సౌజన్యంతో నిర్వహించిన దివ్యాంగుల యొక్క ఉపకరణాల నిర్ధారణ శిబిరం విజయవంతమైందని జిల్లా విద్యాశాఖ సమ్మిళిత విద్య సమన్వయకర్త చీర్ల యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా డీఎమ్‌హెచ్ రవి శంకర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు ఈ శిబిరం ద్వారా వారికి కావలసిన ఉపకరణాలను ఉచితంగా పొందవచ్చునని అన్నారు. ప్రభుత్వం వారికి అందిస్తున్న వివిధ రకాల సౌకర్యాలను వినియోగించుకొని జీవితంలో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఐఈ కోఆర్డినేటర్ యుగంధర్ మాట్లాడుతూ శిబిరంలో భాగంగా డాక్టర్లు దివ్యాంగుల యొక్క వైకల్యాన్ని పరిశీలించి వారికి అవసరమైన ఉపకరణాలను నమోదు చేసుకొని వాటిని త్వరలోనే విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే సమగ్ర శిక్ష, తెలంగాణ దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న కదలలేని విద్యార్థుల కోసం ఇంటి వద్దనే విద్య, ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్పోర్ట్ అలవెన్స్, స్టైఫండ్, ఉపకరణాల పంపిణీ, మైనర్ సర్జరీలు, ఫిజియోథెరపీ వంటి కార్యక్రమాల ద్వారా దివ్యాంగులు సాధారణ పిల్లలతో సమానంగా ముందుకెళ్లేటట్లు తెలంగాణ సమగ్ర శిక్ష ప్రత్యేక శ్రద్దను కనపరుస్తుందని అన్నారు. ఈ శిబిరానికి జిల్లాలని అన్ని మండలాల నుండి 0-18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులు 162 మంది హాజరుకావడం జరిగింది. ఇందులో 127మంది దివ్యాంగ బాల బాలికలను వివిధ రకాల ఉపకరణాలకు ఎంపిక చేయడంజరిగింది. 70మంది విద్యార్థులకు వినికిడి యంత్రాలు, 29మంది విద్యార్థులకు క్యాలిపర్స్, 17మంది విద్యార్థులకు రోలేటర్స్, 30 మంది విద్యార్థులకువీల్ చైర్స్, ఏడుగురికి ట్రై సైకిల్స్, 22మంది విద్యార్థులు ఎమ్మ్ ఐడీ కిట్స్‌కు, 8మంది విద్యార్థులు క్రచెస్‌కు నలుగురు విద్యార్థులు బ్రెయిలీ కిట్స్‌కు ఎంపికం కావడం జరిగింది. ఈ శిబిరానికి హాజరైన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులకు భోజన సదుపాయం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎమ్‌హెచ్ఓ డాఃశ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్‌సీహెచ్ డా.ఇస్మాయిల్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్‌నాగన్న, ఎఎల్ఐఎమ్‌సీఓ డాక్టర్లు, అన్ని మండలాల ఐఈఆర్పీలు, దివ్యాంగ బాల బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించాలి

### ● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.చంద్రశేఖర్



గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యాన కళాశాల విద్యార్థులు

**కొత్తకోట, నవంబర్ 23 ప్రభాతవార్త:** జిల్లాలోని కొత్తకోట మండల పరిధిలోని పాలెం గ్రామంలో ఉద్యాన కళాశాల మోజర్ల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం యూనిట్ నిర్వమించారు. వారం రుజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా 3వ రోజు బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ మీద పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మ గాంధీ మన దేశాన్ని గురించి ఎన్నో కలలు కన్నారని నిరక్ష్యరాస్యత, పేదరికం, అపరిశుభ్రత వంటి చీకట్లను దేశం నుండి తరిమికొట్టాలపి, పరిశుభ్రతను సాక్షాత్తు దైవ స్వరూపంగా భావించారని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా రోగాలకు మూలం పరిశుభ్రత లేకపోవడం, దీనివల్ల రోగాలు ఆపై ఖర్చులు, అప్పులు తప్పడం లేదనిఅనేక కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయని అన్నారు. అందరు సమిష్టిగా కలిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని మన దేశం బాగుండాలంటే మనందరం స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల పరిసరాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి పాఠశాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలపు, కలుపు మొక్కలను తీసివేస్తారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాదా రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.చంద్రశేఖర్, ఉన్నత పాఠశాల అధ్యాపక బృందం, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి మహాసభలను విజయవంతం చేయాలి



సాతర్లలో ఏఐటియుసి గోడపోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

**ఇటిక్యాల, నవంబరు23 ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన యాదగిరిగుట్టలో జరిగే ఏఐటియుసి 3వ మహాసభలను కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జోగులాంబ గద్వాల ఏఐటియుసి జిల్లా కోశాధికారి ఆశన్న పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఏఐటియుసి గోడపత్రికలను కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను పెట్టుబడిదారు వ్యవస్థకు అనుకూలంగా మార్చుతూ కార్మికులను ఇబ్బందులను గురి చేస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని దీనివల్ల లక్షల మంది కార్మికుల ఉద్యోగాలు తొలగిపోతున్నాయి అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పని చేస్తున్న వివిధ రకాల కార్మికుల హక్కులను కాపాడుకునేందుకై మహాసభకు అధిక సంఖ్యలో కార్మికులు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి కోశాధికారి ఆశన్న, నాయకులు రామేశ్వరి, విష్ణు, మహేష్, నాగన్న, లింగన్న, సామ్‌సోన్, ఎజికల్ తదితరులు ఉన్నారు.

## ఆవర్తన మూలక చిత్రపటం రూపొందించిన విద్యార్థినిలు




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త:** నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వినూత్నంగా కైలాస పటం ఆకృతిలో రసాయన శాస్త్రానికి సంబంధించిన మూలకాల ఆవర్తన పట్టిక చిత్రపటాన్ని రూపొందించినట్లు ప్రిన్సిపల్ ఖమర్ షాజహాన్ సుల్తాన తెలిపారు. కళాశాలలో రసాయన శాస్త్ర విభాగానికి సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు షేక్ ఖాజాబీ, ఉమాదేవి, బి. రాజు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు పూజిత, సానియా ములకాలకు సంబంధించి ఆవర్తన పట్టిక చిత్రపటాలను రూపొందించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు రసాయన శాస్త్రంలో పట్టు సాధించడనికి పీరియాడిక్ టేబుల్ మూలకాలను సులభంగా నేర్చుకొనుటకు కైలాస పటం రూపంలో సరళ పద్దతిలో అర్థమయ్యే విధంగా విద్యార్థులు రూపొందించారని, చిత్రపటాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు సిద్ధిఖ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. దీనివలన విద్యార్థులు చాలా సులభంగా రసాయన శాస్త్ర మూలకాలను నేర్చుకోవచ్చని వివరించారు. కైలాసపట రూపంలో ఆవర్తన పట్టిక చిత్రపటాన్ని రూపొందించిన విద్యార్థులను పాఠశాల ప్రధానాచార్యులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## ఘన లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఖిల్లాఘణపురం, నవంబర్ 23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీఘన లింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఘనలింగేశ్వర స్వామి వారికి అభిషేకం, అర్చన కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త బలిజపల్లి విద్యాదేవి నాగభూషణం దంపతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో దాతల సహకారంతో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదాన్న కార్యక్రమం నిర్వహించడం సర్వసాధారణంగా జరుగుతుందని ఆయన తెలిపారు. దాతల సహకారంతో మహాన్నదాన కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీలు, గ్రామ యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రాక

**కోయిల్‌కొండ, నవంబరు23 ప్రభాతవార్త:** నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి నేడు మండలంలోని శేరి వెంకటాపూర్‌లో జరిగే ఆంజనేయస్వామి జల్దిబిందె మహాఉత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నారని సర్పంచ్‌సుందరమ్మ మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్నివిజయవంతం చేసేందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

**కొత్తకోట, నవంబర్ 23 ప్రభాతవార్త:** కొత్తకోట ఆర్టీసీ బస్టాండ్ ను పరిశుభ్రంగా ఉంచాలని ఉమ్మడి జిల్లా జిల్లా ఆర్టీసీ రీజినల్ యేనేజర్ శ్రీదేవి అధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఎం బుధవారం కొత్తకోట బస్టాండ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించడంతో పాటు బస్‌పాస్ కేంద్రాన్ని, కార్గో సేవలను, మరుగుదొడ్లను ఆర్ఎం పరిశీలించారు. బస్టాండ్ లో గల వ్యాపార సముదాయాల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రైవేట్ వ్యక్తుల ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్ఎం వెంటఆర్టీసీ అధికారులు కెఆర్ రెడ్డి, అలివేలమ్మ, భాను, ఆంజనేయులుగౌడ్, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

## ఎస్పీని సన్మానించిన టిఆర్ఎస్ నేతలు

**ఉప్పునుంతల, నవంబరు23 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ మనోహర్ బుధవారం ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ సందర్శించడం జరిగింది. ఎస్పీ రాకతో టిఆర్ఎస్ నాయకులు, అచ్చంపేట పాలశీతలీకరణ చైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో టిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడు మేడమోని శ్రీనివాసులు, పాత్కుల రాంచంద్రయ్య, పర్వతాలు, ఎల్లయ్య యాదవ్, చిన్నజంగయ్య, తాంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త:** తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్) ప్రిన్సిపల్ ఖమర్ షాజహాన్ సుల్తాన ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్ పూర్తిచేసి ఉండి 55 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. పిహెచ్‌డి, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, నవంబర్ 26 సాయంత్రం 4 గం.ల వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల లిస్టును

## వనపర్తి ఆర్డీఓకి అందజేసిన ఎంఆర్ఓ

**వనపర్తి రూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ ఆఫీస్ లో ఆర్‌డీఓ ఆధ్వర్యంలో టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబందించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎంఆర్ఓ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజవర్గానికి సంబందించి బుధవారం ఓటర్ లిస్టును కలెక్టరేట్ కార్యాలయం, ఆర్డీఓ ఆఫీస్, ఎంఆర్ఓ ఆఫీస్, 6 పోలింగ్ కేంద్రాలలో ప్రచురించడం జరిగిందని తరువాత అన్ని గుర్తింపు పొందిన రాజీకాయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ అధ్యక్షతన జరిగిన సమావుశంలో డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును ఇవ్వడం జరిగింది. 23/11/2022 నుండి వచ్చే నెల 09/12/2022 వరకు బుధవారం పబ్లిష్ చేసిన ఓటర్ లిస్టుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారు కూడా అబ్జెక్షన్స్ ఫైల్ చేయవచ్చునని ఇట్టి డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఇంకా ఎవరైనా అర్హులైన టీచర్స్ పేర్లు మిస్సింగ్ అయిన వారు మరల 23/11/2022 నుండి09/12/2022 వరకు అప్లై చేసుకోవచ్చునని తెలిపారు.